# బహుభయంకర మే'తా'వులు

బోద్ధారో మత్సర గ్రస్తాః ప్రభవః స్మయదూషితా:

అబోధోపహతాశ్చాన్యే జీర్ణ మంగే సుభాషితం:

అంటాడు భర్తృహరి

ఏదేనా రాయమని ఈ పత్రిక వారు అడిగారు... నిజమే ఏమైనా చెప్పాలని ఉంటే నాలాంటి రచయితలకు అక్షరం సరైన మాధ్యమం... బాగానే వుందికానీ ఏమిటి చెప్పడం?

పై శ్లోకంలో చెప్పినట్టు తెలిసిన వారూ, ప్రభువులూ వినే స్థితిలో లేరు... సామాన్యులకా వినే తెలివిలేదు (అవసరం అస్సలు లేదు)... అందుకే చెప్పాలీ అనిపించిందేదైనా ఉంటే గింటే, లోపలికి దిగమింగుకోడం అలవాటైపోయింది. అదుగో సరిగ్గా అట్లా ఉన్నప్పుడు ఈ పత్రికవారు ఫోనుచేసి పర్వాలేదు ఏదో రాయండి, అదీ నెలకో మాటే గదా పాఠకులు భరిస్తార్లెండి అన్నారు.. ఆనందం!

ఆనందం అని అనేశాను గానండి... భయం దాన్ని మింగేస్తూంది. భయం దేనికంటారా? నా అజ్ఞానానికీ, నా లోపల కురచదనానికీ, నా అసమర్థతకీ నేనే భయపడే రోజులు పోయాయి (తెలుగు రచయితను గదా!) ఇప్పుడు నా భయమల్లా 'విమర్శకులు' అన్న వేషం వేసుకున్న మే'తా'వుల గురించి.. వల్లానూ...

ముఖ్యంగా మన తెలుగు సాహితీ విమర్శకుడు బహు భయంకరుడు (కొందరు ఇందుకు మినహాయింపు... కొందరంటే బహు కొందరని)

వీళ్లు పైన భర్తృహరి చెప్పిన మూడు వర్గాల్లో ఏకోవకీ చెందరు... వీళ్లది ఓ ప్రత్యేక జాతి...

ప్రభువులా?.. కాదు

బాగా తెలిసినవారా?.. కానే కాదు

అసలు తెలీనివాళ్లా?... వుహూఁ

మరి?

వీళ్లు సందర్భానుసారం సంకలన కర్తలుగానూ, సాంపాద(త)కులుగానూ

కలవులుగానూ... కథకులుగానూ మీ'టింగు'ల్లో (అధిక) ప్రసంగికులుగానూ ఒకటేమిటీ రచనా ప్రక్రియ అన్నదానికి సంబంధించిన అన్ని విషయాల్లో అన్ని రకాల కార్యక్రమాల్లో రకరకాలుగా వేషాలు మార్చగల కళాభినివేశం వున్న వాళ్లు...

వీళ్లు గురించండీ నా భయమంతానూ

వీళ్లు తమని తాము watch dogs అన్చెప్పుకుంటా సాహిత్యాన్ని కాపలా కాస్తున్నాం అంటూంటారు.

వీళ్లు వీర భయంకర భాషాభిమానులుగా కాననయ్యేదరు... ఎందుకో తెలుసాండీ? వీళ్లకి తెలిసింది ఒక భాషే గనుక... (ఆంధ్ర భాషా! ఆనందించుము) వీళ్లు పరభాషా సాహిత్యం కూడా చదువుతారు... ఎట్లా?

దాన్నెవరేనా తెలుగు చేస్తే... (అసలు తెలుగు చేయబడ్డ పరభాషా సాహిత్యం ఎంత ఉందో అందరికీ తెలుసు)

వీళ్లకి 'కాఫ్కా', 'నెబకోవ్'లు తెలియరు (వీళ్లని తెలుగు చేయగల దిట్టలు ఇంకార రాలేదు)

ఒకవేళ వాళ్ల పేర్లు తెలిసినా చాలు వాళ్ల సాహిత్యం మొత్తాన్నీ బేరీజు వేయగల్రు. ఎలాగంటే వీళ్లు అలాంటి తుంటరి రచయితల గురించిన వ్యాసాలు (తెలుగులో) చదివుంటారు. అవి చదివేసి వారి వారి సాహిత్యాన్ని తక్కట్లో పారేసి తూకంవేసి పారేసి దాని 'రేటు' ఎంతో ఏమిటో చెప్పెయగల్రు... చెప్పేస్తారు.

ఇక్కడ ఓ విషయం ప్రస్తావిస్తాను.

వివాదాస్పదుడిగా పేరుబడ్డ రచయిత 'రష్దీ'

రష్దీ పుస్తకం 'సటానిక్ వర్సెస్' మన దేశంలో ప్రత్యక్షమయిన వెంటనే ఆ పుస్తకాన్ని ఇస్లామిక్ దేశాలు నిషేదించాయి. ఇస్లాం వ్యతిరేకంగా చెప్పబడ్డా 'రష్దీ మీద మరణదండన 'ఫత్వా' జారీ చేయబడ్డది. వెనువెంటనే మన్ది మరీ సెక్యులర్ దేశం కదా.. (అందునా అప్పటికే రష్దీ పుస్తకం 'మిడ్‌నైట్స్ చిల్డ్రన్' ఇందిరాగాంధీ కినుకకు కారణమయి ఉండింది కూడానూ) మనదేశంలో కూడానూ 'సటానిక్ వర్సెస్' నిషేదానికి గురైంది. ఇంకేం ఆ పుస్తకాలు నల్లబజార్లో విపరీతమయిన ధరకు అమ్ముడయ్యాయి... అది ఫక్తు వ్యాపార సంబంధ విషయం. మన సాహిత్య గొడవలుగానీ మత ప్రసక్తి గానీ నల్లబజారుకు అడ్డురాలేదు.

ఆ సందర్భంలో ఒక ముస్లిం రాజకీయ నాయకుడు ఆ పుస్తకాన్ని తీవ్రంగా తెగనాడారు... అప్పుడాయనకూ ఓ పత్రికా ప్రతినిధికీ మధ్య జరిగిన సంభాషణ యిలా ఉంది.

పత్రిక: "అయ్యా! సటానిక్ వర్సెస్ పుస్తకాన్ని ఎందుకని నిషేధించాలంటున్నారు"!

రా.నా : "అది ఇస్లాం వ్యతిరేక భావాలు కలిగివుంది. దాన్నిండా blasphemy (దైవ దూషణ) ఉన్నది."

పత్రిక : "మీకెట్లా తెలుసా సంగతి? మీరు ఆ పుస్తకాన్ని చదివారా?

రా.నా.: భలేవారే నేను ఇస్లాం విశ్వాసిని... దాన్ని వ్యతిరేకించే భావాలు గల పుస్తకాన్ని ఎలా చదువుతాను? మీరైనా నన్నెలా చదవమంటారు?

పత్రిక:?

పై సంభాషణలోని రాజకీయ నాయకుడికీ మన విమర్శక శిఖామణులకీ పెద్ద వ్యత్యాసం లేదు..

వీళ్లు కూడా చదవకుండా ఏ పుస్తకం పైనైనా ఎడాపెడా వాయించేయగల్రు.

ఈ మహానుభావుల మేధ ఎంత గొప్పగా ఉంటుందో చెప్పడానికో చిన్న ఉదాహరణ... ఓ మీటింగులో సదరు విమర్శకాగ్రేసర్ భుక్తాయాసం తీర్చుకుంటున్నారు. (వారేం తిన్నారో చెప్పనవసరం లేదుగదా) నా మిత్రుడొకడు పరమకంత్రి.. ఓ ప్రముఖ దినపత్రికలోని ఓ వార్తని ముక్కల కింద విడగొట్టి ఓ రెండు తావులు నిలువునా నింపి పట్టుకెళ్లి ఆ మహాశయులకు చూపించాడు.. దాన్ని నిశితంగా(?) పరిశీలించిన ఆ గొప్ప మేధావి "ఆహా! చాలా మంచి కవిత వ్రాసారండీ. ఫలానా పత్రిక ఆదివారం అనుబంధానికి పంపండి ఎడిటర్కి నేను ఫోన్చేసి చెప్తాను" అని సెలవిచ్చారు.

ఆ ఫలానా పత్రికలోదే ఆ వార్త...

అదండీ సంగతి... ఇలాంటి వాళ్లకి భయపడకుండా నా లాంటి అల్పజీవి ఎలా ఉండగలడండీ... అందుకే రాయమని అనగానే కలిగిన ఆనందం పలచబడ్డది.

* * *

చదవడం రాని నాడు ఎంత అల్పజీవో చదవడం తెలిసీ చదవనివాడు అంతకు ఎన్నో రెట్లు అల్పుడు. ●